సామాజికదృష్టికి నిదర్శనం ఇనాక్ రచనలు

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక దృష్టికి నిదర్శనంగా ఇనాక్ సాహిత్యరచనలు నిలుస్తాయని ఎమ్మెల్సీ నిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో మంగళవారం వేంకటేశ్వరయూనివర్సిటీ విశ్రాంత వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌సాహితీ సప్తాహం ప్రారంభ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి ద్రవిడ విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సృష్టి దృష్టి గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఇనాక్ వివిధ ప్రక్రియల్లో చేసిన రచనలు అన్నింటిలోనూ దళిత బహుజన వాదం ధ్వనిస్తుందన్నారు. సభాధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, ఆధ్యాత్మికవేత్త పురాణపండ శ్రీనివాస్, సంగీతగురువు మల్లాది ఉష, గుండవరపు గీతాదేవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావు గర్వకారణం

నల్లకుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రాంచందర్‌రావు నియామకం యావత్ బ్రాహ్మణ జాతికే గర్వకారణం అని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవులపల్లి రమణారావు పేర్కొన్నారు. మంగళవారం బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్.రాంచందర్ రావును సత్కరించిన సేవాదల్లో నల్లకుంటలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మరిన్ని ఉన్నతమైన పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి లక్ష్మీనరసింహారావు, కావాల శ్యామసుందర్‌రావు, కోశాధికారి ఉరిటే ప్రసాదరావు, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి గంప రామారావు, గూడ జయరాం, సర్వరాము శశాంక్ మోహన్, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

నల్లకుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యానగర్‌లోని మార్క్సభవన్‌లో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్రఅధ్యక్షుడు కె.సూర్యం, యూనియన్ కార్యదర్శి వి.అరుణకుమార్, నాయకులు ఎర్రల కురుమయ్య, వెంకట్రాములు, గట్టయ్య, ఎ.వెంకన్న, గోవిందమ్మ, నరేష్ తదితరులు పాల్గొని 9న సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమ్మెల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది భాగస్వాములు కావాలని కోరారు.

వైద్యుడు దేవుడితో సమానం: ఎమ్మెల్సీ

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వైద్యుడంటే దేవుడితో సమానమని ఎమ్మెల్సీ నిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఎస్ఆర్‌ఆర్ చారిటబుల్‌ట్రస్ట్, వినతి ఎన్విరో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయ గానసభలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ వైద్యులకు వైద్య రత్న అవార్డుప్రదానోత్సవం మధుసూదనాచారి చేతులమీదుగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు డా.గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ఈ సమాజంలో పూర్వకాలం నుండే వైద్యులకు ఎంతో పేరుప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. డా. జె.ప్రదీప్‌కుమార్, డా.షరీఫ్‌ఖాన్, డా.కొండపల్లి అపర్ణ, డా.వీ.సింగరాజులకు అవార్డులు బహూకరించి సత్కరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ కౌన్సిల్ సభ్యులు డా.ఎస్‌పీ.భారతి, విశ్రాంత డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.వేణుగోపాలశర్మ, లాయర్ డా. అమంచ అంజయ్య, రచయిత్రి డా.రాధాకుసుమ, నిర్వాహకులు ఆయన్ డా.ఎస్.రామచంద్రరావు, కెమురుశెమోహనరాజు, డా.వి.గంగాధర్‌రెడ్డి, వీపీ మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి : కార్పొరేటర్ పద్మ

నల్లకుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో పరిసరాల పరిశుభ్రతతో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి ప్రజారోగ్యంపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నామని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్‌లో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు భద్రత సామగ్రిని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో ఎప్పటికప్పుడు చెత్త, చెదారం, మట్టి కుప్పలను తరలించి ఆరోగ్యవంతమైన బాగ్‌అంబర్‌పేట డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు, ఎస్ఎఫ్ఏ తదితరులు పాల్గొన్నారు.

● గోల్నాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లోని తమ క్యాంపుకార్యాలయంలో జీహెచ్ఎంసీ కార్మికులకు భద్రతా సామగ్రిని కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత విషయంలో పారిశుధ్యకార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా కార్మికులు మరింత బాధ్యతగా పనిచేయాలని ఆమె కార్మికులకు సూచించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

బర్కత్‌పుర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. పర్యావరణం ఉన్న విశిష్టతను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని మొక్కలు నాటడమే కాదు వాటి సంరక్షణ బాధ్యత కూడా చేపట్టాలన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని శ్రీచైతన్య పాఠశాలలో గ్రీన్ ఇండియా మిషన్‌హరిత భారత్, సమృద్ధి భారత్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణం ప్రేమను పెంపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రుబీన, ఏజీఎం మహ్మద్‌అలీ, ఆర్‌వి మల్లికార్జున్‌నాయుడ్, కో-ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేష్

అసిస్టెంట్ ప్రొఫెసర్ అనురాధకు ఓయూ డాక్టరేట్

బర్కత్‌పుర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అనురాధకు ఓయూ డాక్టరేట్ ప్రకటించింది. మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో అనురాధ ఎన్విరాన్‌మెంట్ న్యూస్ కవరేజ్ ఇన్ సెలెక్టెడ్ ఇంగ్లిష్ డైలీ అనే అంశంపై సమర్పించిన నివేదికకు ఈ డాక్టరేట్ ప్రకటించారు. ప్రొఫెసర్ కె.సురేందర్ పర్యవేక్షణలో అనురాధ ఈ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందన్నారు.



నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, నాగమ్మ దేవాలయం కమిటీ ఎన్నిక

రాంనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ శ్రీనల్లపోచమ్మ, ముత్యాలమ్మ, నాగమ్మ దేవాలయ నూతన కమిటీని మంగళవారం ఆలయ ఆవరణలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా ఎన్.రాజేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్ ముదిరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వి.సత్యనారాయణ, సతీష్‌యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా అనూప్‌కుమార్, మీనా, రమేష్‌గౌడ్, భానుప్రసాద్, లక్ష్మి, ఉపాధ్యక్షుడిగా ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా రవీందర్‌యాదవ్, కార్యదర్శులు నర్సింగ్ రావు, ఉత్తమ్ ప్రవీణ్‌కుమార్, ధర్మేందర్ తదితరులు నియమితులయ్యారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, జూలై 1(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దాదాపు 60 సంవత్సరాల వయస్సు గల ఓ వృద్ధుడి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్ ఎస్ఐ నర్సింహా తెలిపిన వివరాల ప్రకారం, దాదాపు 55 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయస్సు మధ్య ఓ గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం గాంధీనగర్ పీఎస్ పరిధిలోని న్యూ బోయిగూడ మెట్రోపిల్లర్ స్టేషన్ 1031 ఫుట్‌పాత్‌పై పడి ఉందని సమాచారం అందింది. అక్కడికెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గానీ లేదా ఎస్ఐ నర్సింహా 8712660145లో గానీ సంప్రదించాలని ఆయన కోరారు.

అధ్వానంగా రహదారి

● గుంతలమయంగా దయారా మార్కెట్ రోడ్డు
● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రాంనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల నిర్లిప్తత లోపం కారణంగా దయారా మార్కెట్ నుంచి బొమ్మల గుడి మీదుగా ముషీరాబాద్ మెయిన్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి, ఎక్కడ రోడ్డు ఉందో ఎక్కడ గుంత ఉందో తెలుసుకోలేక వాహనదారులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ రోడ్డుపై వెళ్లిన వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి.

నిధులు మంజూరైనా...

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ మార్గంలో సీసీ రోడ్డు వేయడానికి దాదాపు రూ.1.16కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు పంపారు. స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రవిచారి చొరవతో అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆ పనులు సకాలంలో జరుగకపోవడంతో ఆ పనులను అప్పటి మున్సిపల్ కమిషనర్ ఆమ్రపాలి రద్దు చేశారు. అప్పటి నుంచి ఆ రహదారి నిర్మాణ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుతం సమస్య మరింత తీవ్రతరం కావడంతో స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రవిచారి దృష్టికి మరోసారి తీసుకెళ్లారు. స్పందించిన వారు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ ముషీరాబాద్ డీఈ జ్యోతి, ఏఈ వినోద్‌కు సూచించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు అధికారులు కొన్ని రోజుల క్రితం మళ్లీ రూ.1.16కోట్ల వ్యయంతో నూతన ప్రతిపాదనలు జోనల్ కమిషనర్‌కు పంపించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు యుద్ధప్రాతిపదిన నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



దయారా మార్కెట్ - ముషీరాబాద్ మెయిన్‌రోడ్డుపై గుంతలు.. బురదనీరు

ప్రతిపాదనలు పంపించాం

దయారా మార్కెట్ టు ముషీరాబాద్ మెయిన్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిలో నూతన రోడ్డును నిర్మించేందుకు ఇటీవల ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. తాత్కాలికంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గుంతలు పూడ్చే పనులు చేపడుతున్నాం. నిధులు మంజూరు కాగానే శాశ్వత రోడ్డు పనులు చేపడతాం.

- వినోద్‌కుమార్, జీహెచ్ఎంసీ ఏఈ



దయారా మార్కెట్ - ముషీరాబాద్ మెయిన్‌రోడ్డుపై ఏర్పడిన గుంతలు

రోడ్డు నిర్మాణానికి కృషి



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.1.16కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేశారు. దీంతో తాను ఇటీవల హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జోనల్ కమిషనర్ రవికిరణ్ దృష్టికి తీసుకెళ్లాను. ఇటీవల జోనల్ కమిషనర్ ఈ రోడ్డును సందర్శించారు. వెంటనే ఈ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

- ముఠా గోపాల్, ముషీరాబాద్ ఎమ్మెల్యే

సమస్యను జోనల్ కమిషనర్‌కు వివరించాం



దయారా మార్కెట్ టు ముషీరాబాద్ మెయిన్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరగడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై వెంటనే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్ ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో వివరించాను. త్వరలోనే నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

- రవిచారి, కార్పొరేటర్, రాంనగర్ డివిజన్

ప్రభుత్వం దృష్టికి పెన్షనర్ల సమస్యలు

● ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

పంజాగుట్ట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెన్షనర్ల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ గవర్నమెంట్ విమెన్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్‌పర్సన్ ఆర్.ఉమాదేవి అధ్యక్షతన సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆయనతోపాటు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, జాతీయ పెన్షనర్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ జయభారతి, తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ అధ్యక్షుడు లక్ష్మయ్య, ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ సుధాకర్, వివిధ సంఘాల నాయకులు రాజేందర్‌బాబు, పుల్లయ్య, వెంకటరెడ్డి, దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు మాట్లాడారు. పెన్షనర్లకు తన మద్దతు ఉంటుందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తాను కూడా పెన్షనర్‌ను అని, ఇందులో భాగస్వామ్యం అవుతానని అన్నారు. తాను ఉపాధ్యాయుడిగా వీఆర్‌ఎస్ తీసుకున్నానని ఇప్పటి వరకూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. ఒక్కో నెల పెన్షన్ మాత్రమే అందుకున్నానని తెలిపారు. యూనియన్‌లు పోరాటం చేయాలని, ఒక పార్టీకి, ప్రభుత్వానికి అనుబంధంగా ఉండొద్దన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవలు అందేలా హెల్త్ కార్డులు ఇవ్వాలని, డీఏ ఇవ్వాలని, మహిళా పెన్షనర్ల సంఘం నాయకులకు ఈహెచ్ఎస్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని ఆర్.ఉమాదేవి డిమాండ్ చేశారు. సమావేశంలో పెన్షనర్ల జాతీయ, రాష్ట్ర సంఘాల నేతలు పాల్గొని మద్దతు తెలిపారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జాయింట్ యాక్షన్ పోరాటం చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. అసోసియేషన్ నాయకులు కె. ధనలక్ష్మి, ఎస్.ఎం.ఎల్ నాగమాంబ, నాగమణి రెడ్డి, భాగ్యలక్ష్మి, జిలక్ష్మి, డి.పద్మావతి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంస్థాగత సభకు తరలిన నేతలు

నల్లకుంట, ఆంధ్రజ్యోతి: నల్లకుంట డివిజన్ మాజీ కార్పొరేటర్ వనం రమేష్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు బీజేపీ సంస్థాగత నిర్మాణం-2025 పేరిట మంగళవారం నగర శివారులోని వేడుకన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్, బీజేపీ నల్లకుంట డివిజన్ కన్వీనర్ ఎల్.కొండలగౌడ్, సీనియర్ నాయకుడు బి.సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్

ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

రాంనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. ... రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ఖాలీద్, కె.యాదానాయక్ నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను విడుదల చేయాలని, 2023 జనవరి 1 నుంచి రావాల్సిన 2వ పీఆర్‌సీని 51 శాతం ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



పద్యనాటక ప్రదర్శనలో కళాకారులు

రసరమ్యంగా పద్యనాటక ప్రదర్శనలు

చిక్కడపల్లి, జూలై1 (ఆంధ్రజ్యోతి): కల్పన కళానికేతన్ వారు రాష్ట్ర ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన పద్యనాటక ప్రదర్శనలు రసరమ్యంగా సాగాయి. శ్రీకృష్ణరాయబారం, శ్రీకృష్ణ తులాభారం పద్యనాటకాలను కళాకారులు ప్రేక్షకులకు ప్రదర్శించారు. శ్రీకృష్ణుడిగా కిషోర్‌కుమార్, దుర్యోధనుడిగా ఐ.శ్రీనివాస్, అర్జునుడిగా దొంతి జంగయ్యగౌడ్, నారదుడిగా సర్వేశ్వరరావు, సత్యభామగా సాయిలక్ష్మి, రుక్మిణిదేవిగా సురభి వెంగమాంబ, నళినిగా మాధవి పాత్రోచితంగా నటించి ప్రదర్శనను రక్తికట్టించారు. అనంతరం జరిగిన సభాకార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను అభినందించారు.



గానం చేస్తున్న ఏపీ పుల్లారావు, శ్రీనివాసులు

ఆకట్టుకున్న హిందీ ఆల్‌టైమ్ హిట్స్

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సుబ్బు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన హిందీ ఆల్‌టైమ్ హిట్స్ కార్యక్రమం ఆకట్టుకుంది. సంస్థ నిర్వాహకులు, ప్రముఖ గాయకులు శ్రీధర రామసుబ్రహ్మణ్యంతో పాటు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు రాగమాధురి సంస్థ వ్యవస్థాపక అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఏపీపుల్లారావు, ఎస్.శ్రీనివాసులు, అరుణ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, నాగేందర్, కమలేష్‌ఎడేశ్వర్, సాయిబాబు, రవి, నాగేశ్వరప్రసాద్, అనంత జ్యోతి, సావిత్రిప్రభాకర్, కృష్ణవేణి, సత్యదీప్తి, స్వప్న, భువనేశ్వరి, పూర్ణిమ, శ్రవంతిరావు తదితరులు పలు హిందీహిట్ సాంగ్స్‌ను పాడి శ్రోతలను అలరించారు. ఈ సందర్భంగా ఏపీ పుల్లారావు, ఎస్.శ్రీనివాసులును సత్కరించారు.

కాచిగూడ పీఎస్ పరిధిలో మహిళ అదృశ్యం

బర్కత్‌పుర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ పీఎస్ పరిధిలో మహిళ అదృశ్యమైంది. ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న ప్రభావతి(55) మానసిక ప్రవర్తన సరిగ్గా ఉండదు. గతనెల 29న మధ్యాహ్నం 1 గంటకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రభావతి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికిన ఆమె ఆచూకీ లభించలేదు. మంగళవారం కుమార్తె యాస్మీన్‌రాణి కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రభావతి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. ఆహార్‌నగర్, లక్ష్మీకాపూల్, మీరా థియేటర్, హిమాయత్‌నగర్ పరిధుల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, డీడీకాలనీ, కృపాదియా, ఏపీఏస్‌సీ పరిధుల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.



గణేష్ పద్మశాలికి అవార్డును ప్రదానం చేస్తున్న అతిథులు

ఎల్‌సీఎస్‌పీపీ అధ్యక్షుడికి బీపీడీ 320హెచ్ అవార్డు

కవాడిగూడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్లాటినం(ఎల్‌సీఎస్‌పీపీ) అధ్యక్షుడు శేరుపల్లి గణేష్‌పద్మశాలికి బెస్ట్ ప్రెసిడెంట్ ఆఫ్ డిస్ట్రిక్ట్(బీపీడీ) 320హెచ్ బెస్ట్ క్లబ్ ది డిస్ట్రిక్ట్ అవార్డుకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా శేరుపల్లి గణేష్‌కు లయన్స్‌క్లబ్ 320హెచ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.మనోహర్‌రెడ్డి మంగళవారం ఈ అవార్డును ప్రదానంచేసి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు గ్రేటర్ కమలాకర్ ముస్యాల, రవీంద్రనాథ్‌గుప్తా, అశోక్‌జైన్, కల్వారి శ్రీనివాస్, మధు, ప్రకాష్, రామమూర్తి, విజయేందర్‌రెడ్డి, సుమన్, హారిక, సునీత, విద్య టీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

కవాడిగూడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ సింగాడికుంటలో రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి సింగాడికుంట బస్తీప్రజలతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, నగర నాయకులు వల్లాల శ్రీనివాస్‌యాదవ్, రాజశేఖర్‌గౌడ్, నీలం వేణుయాదవ్, ముచ్చుకుర్తి ప్రభాకర్ పల్లే సునీల్‌యాదవ్ తదితరులు హాజరయ్యారు. అనంతరం జరిగిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నాగయ్య డాక్టరేట్ సాధించడం అభినందనీయం

కవాడిగూడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే డాక్టర్ నాగయ్య పీహెచ్‌డీ డాక్టరేట్ పొందడం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. పీహెచ్‌డీ సాధించిన నాగయ్యను కవాడిగూడ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు నిత్యవిద్యార్థులుగా మారిపోవడమే వృత్తికి న్యాయం చేయగలుగుతారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న నాగయ్య డాక్టరేట్ సాధించడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ మీనాకుమారి, ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ పావని, యూటీఎఫ్ నాయకులు దేవదాస్, ఉపాధ్యాయులు జాని, వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యం, మానవత్వం పట్ల వైద్యుల అంకితభావం

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వైద్యం, మానవత్వం పట్ల వైద్యులకు ఉన్న అంకితభావం అభినందనీయమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రముఖ వైద్యనిపుణులు డా. విజయ్‌కుమార్, డా. జయరాంరెడ్డి, డా. వెంకటరమణలను కాలనీవాసులతో కార్పొరేటర్ పావని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ డాక్టర్లను వైద్యులు అందించే వైద్యం ఎందరో ప్రాణాలను నిలుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, నాయకులు సురేందర్, నర్సింహ, సాయికుమార్, అరుణ్‌కుమార్, జ్ఞానేశ్వర్, నీరజ్, ప్రశాంత్, సంధ్యారాణి, సంయుక్తరాణి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి: కార్పొరేటర్

కవాడిగూడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ క్రీడాకారులకు సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తమ అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదినం పురస్కరించుకుని మంగళవారం ఎస్ఆర్‌టీ స్టేడియంలో కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ ఆధ్వర్యంలో యువతకు క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి రవిందర్, ముషీరాబాద్ కన్వీనర్ ఎం.రమేష్‌రాం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ పోటీల్లో మొత్తం 8 టీంలు పాల్గొంటున్నాయని, 10 రోజుల పాటు జరుగుతాయని, ఫైనల్స్ ఈనెల 13న తేదీన ఉంటాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జె.వెంకటేష్, పరమేష్‌కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సంపత్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ప్రభాకర్ గంగపుత్ర, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నగరనాయకులు కృష్ణహరి, కుమార్‌గౌడ్, గుండుశ్రీనివాస్, గడ్డి శ్రీనివాస్, మహేష్, ప్రేమ్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలతోనే సమాజంలో గుర్తింపు

జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి



భోలక్‌పూర్, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ దార్లవ్వను సన్మానించిన నర్సులు, ఆశావర్కర్లు

ముషీరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించినప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి అన్నారు. జాతీయ డాక్టర్ల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ ఎం.మనోజ్ రెడ్డిని జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందుతున్నాయన్నారు. ఆస్పత్రికి వచ్చేవారితో ఆప్యాయంగా మాట్లాడుతూ.. వైద్యం అందించినప్పుడు ఆదరణ పెరుగుతుందన్నారు. రోగులకు కావల్సిన మందులను అందజేస్తూ జిల్లా వైద్య శాఖకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. ముషీరాబాద్ యూపీహెచ్‌సీ ప్రాంగణంలో భోలక్‌పూర్, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ, ఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ, యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్(యూఎఫ్ఆర్‌డబ్ల్యూఏ) ఆధ్వర్యంలో డాక్టర్ మనోజ్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ డే కేకును కట్ చేశారు. ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు ఇందిర, రేణుక, యూఎఫ్ఆర్‌డబ్ల్యూఏ కార్యదర్శి సయ్యద్ ఖలీద్, డ్రగ్‌ఫైటర్స్ కన్వీనర్ శ్రీలత, శాంతి కమిటీ సభ్యురాలు మణిలా, విజయలక్ష్మి, యూపీహెచ్‌సీ ఏఎన్ఎంలు విజయకుమారి, రత్నమాల తదితరులు ఆయనను సన్మానించారు.